

దర్గాలో చాదర్ సమర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## కులమతాలకతీతంగా కలిసి ఉండాలి

- బాగ్మార్‌సాబ్ దర్గాలో ప్రార్థనలు చేసిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 27 : జిల్లా కేంద్రంలోని బండమీదిపల్లి సమీపంలో ఉన్న బాగ్మార్‌సాబ్ దర్గా వద్ద నిర్వహించిన ఉర్సులో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా చాదర్ సమర్పించి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకతీతంగా ప్రజలంతా కలిసి ఉండాలన్నారు. తన హయాంలో దర్గా అభివృద్ధికి రూ.25లక్షలు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. జిల్లాలో ఆలయాలు, దర్గాల అభివృద్ధికి ఎంతో కృషి చేశామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ రహెమాన్, నాయకులు అహ్మద్ సనా, మోసీన్, మహమూద్, సుల్తాన్, వాజీద్, నవకాంత్, కౌన్సిలర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.




జాతీయ సదస్సులో మాట్లాడుతున్న వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్

## ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలి

- సుస్థిర అభివృద్ధిలో కెమిస్ట్రీ పాత్ర కీలకం : పీయూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 27 : మానవాళి మనుగడ, సుస్థిర అభివృద్ధికి కెమిస్ట్రీ పాత్ర కీలకమని పాలమూరు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ లక్ష్మీకాంత్‌రాథోడ్ అన్నారు. మంగళవారం పీయూలోని గ్రంథాలయం ఆడిటోరియంలో 'కెమిస్ట్రీ ఫర్ ఏ సస్టెయినబుల్ ఫ్యూచర్' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి పీయూ వీసీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యూనివర్సిటీలో రీసెర్చ్ సెంటర్ నెలకొల్పుతామన్నారు. విద్యార్థులు ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలని, అప్పుడే నూతన ఆవిష్కరణలు చేసే అవకాశం ఉంటుందన్నారు. నోట్ స్పీకర్ ఐఐసీటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులను పరిశోధనల వైపు నడిపించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో ఫెలోషిప్‌లు ఇస్తున్నాయని, వాటిని అందిపుచ్చుకొని ఉన్నత స్థానానికి ఎదగాలన్నారు. దేశంలో 37 రీసెర్చ్ సెంటర్లు ఉన్నాయని, మహిళలు వాటిపై మక్కువ చూపడం లేదన్నారు. నేచర్ గొప్ప శాస్త్రవేత్త అని.. మందులు 80 శాతం ప్రకృతి నుంచే పొందుతున్నామని పేర్కొన్నారు. వెహికిల్స్, ఎలక్ట్రానిక్స్, గృహ నిర్మాణ రంగంలో కెమిస్ట్రీ ముఖ్య పాత్ర వహిస్తుందన్నారు. అనంతరం ఐఐసీటీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ వందకు పైగా అబ్‌స్ట్రాక్ట్స్ వచ్చాయని, 200మంది మెంబర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, చైర్మన్ చంద్రకిరణ్, ఈసీ మెంబర్ నూర్‌జహాన్, కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, కో కన్వీనర్లు రామ్మోహన్, అయేషా హష్మీ, రవికుమార్, సిద్ధరామగౌడ్, రూపారాణి, రామరాజు, బేబీ లత, దీప్తిరెడ్డి, స్కాలర్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

## హోరాహోరీగా..

- జడ్చర్లలో కొనసాగుతున్న రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ

జడ్చర్ల టౌన్, ఫిబ్రవరి 27 : స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జడ్చర్లలో నిర్వహిస్తున్న అండర్–14 విభాగం బాలుర 67వ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. మంగళవారం జడ్చర్లలోని మినీస్టేడియం మైదానం, ఎంఎన్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లను డీఈవో రవీందర్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వరుసగా విజయం సాధిస్తున్న మహబూబ్‌నగర్ జట్టును ఆయన అభినందించారు. రెండో రోజు మినీస్టేడియం మైదానంలో జరిగిన లీగ్ మ్యాచుల్లో మెదక్ జట్టుపై ఆదిలాబాద్, నల్గొండ జట్టుపై హైదరాబాద్, మెదక్ జట్టుపై ఖమ్మం, నల్గొండ జట్టుపై మహబూబ్‌నగర్ జట్టు విజయం సాధించాయి. అదేవిధంగా ఎంఎన్ మైదానంలో జరిగిన మొదటి మ్యాచ్‌లో కరీంనగర్‌పై రంగారెడ్డి, నిజామాబాద్‌పై మహబూబ్‌నగర్, కరీంనగర్‌పై ఆదిలాబాద్, నిజామాబాద్‌పై హైదరాబాద్, నిజామాబాద్‌పై వరంగల్ జట్లు గెలుపొందాయి. కార్యక్రమంలో ఏఎంవో బాలుయాదవ్, పరిశీలకులు విద్యాసాగర్, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ రమేశ్‌బాబు, వేణుగోపాల్, శారదాబాయి, ఆనంద్‌కుమార్, రాములు, బాలరాజు, ఉమాదేవి, భానుకిరణ్, రామకృష్ణ, శంకర్, రవి, శ్రీను, రవిగౌడ్, కృష్ణయ్య, మొయిన్ పాల్గొన్నారు.



తలపడుతున్నజట్లు

## మార్చి నెలాఖరుకు ఎల్‌ఆర్‌ఎస్

- 2020లో దరఖాస్తు చేసుకున్న వారికే అవకాశం
- ఉమ్మడి జిల్లాలో లక్ష మందికి ప్రయోజనం

మహబూబ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 27 : ఎల్‌ఆర్‌ఎస్ (లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం) దరఖాస్తుదారులకు సర్కారు శుభవార్త చెప్పింది. పుర ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం 2020 ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసిన వారు రెగ్యులరైజేషన్ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. అప్పట్లో రూ.10వేలు చెల్లించి దరఖాస్తు చేసుకోగా అప్పుడు నిర్ణయించిన ధర ప్రకారమే చెల్లింపులు చేసేలా ప్రభుత్వం అనుమతిచ్చింది. మార్చి 31 లోగా దరఖాస్తు చేసుకున్న వాళ్లు తమ ప్లాట్‌సైజ్‌ను బట్టి ఫీజు చెల్లించి రెగ్యులరైజేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో 31,144 మంది దరఖాస్తు చేసుకోగా 659 పూర్తయి 2,075 దరఖాస్తులను బదిలీ చేశారు. మరో 29,069 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. భూత్పూర్‌లో 5,999 మంది దరఖాస్తు చేసుకోగా, 976 బదిలీ చేయగా, 5,023 పెండింగ్‌లో ఉన్నాయి. జడ్చర్ల మున్సిపాలిటీలో 17,134 మందికి లబ్ధి చేకూరనున్నది. ఉమ్మడి జిల్లాలోని 19 మున్సిపాలిటీల్లో లక్ష మందికిపైగా ప్రయోజనం చేకూరనున్నది.

## విద్యార్థి తలకు గాయం


- ప్రథమ చికిత్స చేయించిన తోటి విద్యార్థులు



గాయపడిన విద్యార్థి వెంకటేశ్

మానవపాడు, ఫిబ్రవరి 27 : తరగతిగదిలో ఆడుకుంటుండగా విద్యార్థి తలకు బలమైన గాయమైన ఘటన మానవపాడు మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో చోటుచేసుకున్నది. వివరాలిలా.. మంగళవారం మధ్యాహ్నం మూడుగంటల సమయంలో తరగతిగదిలోకి టీచర్ రాకపోవడంతో 8వ తరగతి విద్యార్థులు ప్యాడ్లు విసురుతూ ఆడుకుంటున్నారు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు పరీక్ష ప్యాడ్ వెంకటేశ్ తలకు తగిలి బలమైన గాయమైంది. గమనించిన తోటి విద్యార్థులు వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స చేయించారు. అయితే విద్యార్థికి బలమైన గాయమైనా ఉపాధ్యాయులకు విషయం తెలియకపోవడం విస్మయానికి గురి చేస్తున్నది. ఘటనకు సంబంధించి హెచ్‌ఎంను చరవాణిలో ఆరా తీసే ప్రయత్నం చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు.

# కోడ్ కూసింది..



- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు నోటిఫికేషన్
- ఖాళీ అయిన కశిరెడ్డి స్థానానికిపో లింగ్
- మార్చి 28న ఓటింగ్, ఏప్రిల్ 2న లెక్కింపు
- అమల్లోకి వచ్చిన ఎన్నికలనియ మావళి
- బీఆర్‌ఎస్‌కే గెలుపు అవకాశాలు!

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 27(నమస్తే తెలంగాణ) : రాజకీయ పార్టీలు, నాయకులు, ప్రజలంతా పార్లమెంట్ ఎన్నికల వైపు దృష్టి సారించగా ఊహించని విధంగా ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఉంటూ కల్వకుర్తి ఎమ్మెల్యేగా ఎన్నికైన కశిరెడ్డి నారాయణరెడ్డి స్థానానికి మార్చి 28న ఎన్నికలు నిర్వహించనున్నది. దీనికోసం ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది.

మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా బీఆర్‌ఎస్ నుంచి కశిరెడ్డి నారాయణరెడ్డితోపాటు కూచకుళ్ల దామోదర్‌రెడ్డి 2021లో ఎన్నికయ్యారు. పదవీ కాలం ఆరేండ్లపాటు ఉంటుంది. కాగా నారాయణరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరి కల్వకుర్తి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. దీంతో నాలుగేండ్ల ముందుగానే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో కొంతకాలంగా ఈ ఎన్నిక నిర్వహణపై రాజకీయ పార్టీలు, నాయకులు ఎదురు చూస్తుండగా సర్పంచ్ ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఎంపీ ఎన్నికల తర్వాతే ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఉంటుందని భావించగా ఎన్నికల సంఘం అనూహ్యంగా నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో తక్షణమే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఈ నోటిఫికేషన్‌తో ఎంపీ ఎన్నికలకు ముందే ఒక్కసారిగా ఉమ్మడి పాలమూరులో రాజకీయం వేడెక్కనున్నది. కాగా, ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకే విజయావకాశాలు అధికంగా ఉన్నాయి. గతంలో జరిగిన మున్సిపల్, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులే అత్యధికంగా విజయం సాధించారు. ఇటీవల కాంగ్రెస్‌కు చెందిన కౌన్సిలర్లు, గులాబీ నేతలను చేర్చుకుంటున్నా అత్యధికులు బీఆర్‌ఎస్‌తోనే ఉన్నారు. ఇటీవల పార్లమెంట్ నిర్వహించిన సన్నాహక సమీక్షల్లోనూ బీఆర్‌ఎస్ నాయకత్వం బలంగా కనిపించింది. క్షేత్రస్థాయిలో బీఆర్‌ఎస్ బలంగా ఉండటంతో సర్పంచ్ ఎన్నికలకు సైతం కాంగ్రెస్ సర్కారు వెనుకడుగు వేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో తాజా ఉప ఎన్నిక పార్లమెంట్ ఎన్నికల ముందు బీఆర్‌ఎస్‌కు కలిసొచ్చే అవకాశం ఉన్నది. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఆదరణ తగ్గుతుండడంతో ఈ ఉప ఎన్నికలు ఆ ప్రభావాన్ని మరింత పెంచనున్నాయి. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో పార్టీలో టికెట్ల కోసం పోటీలు లేకుండా, క్యాడర్‌లో క్రమశిక్షణ నెలకొన్నది. కాంగ్రెస్‌లో మాత్రం నాయకులు, క్యాడర్ గ్రూపులుగా విడిపోయి బహిరంగంగా విభేదాలను రచ్చకెక్కిస్తున్నారు. ఈ పరిణామాలు కూడా బీఆర్‌ఎస్, ప్రజల్లో గులాబీ పార్టీపై విశ్వాసాన్ని పెంచుతున్నది.



## 4న నోటిఫికేషన్ జారీ

- పాలమూరుక లెక్టర్‌రవి నాయక్

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 27 : మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసనమండలి స్థానానికి మార్చి 28న ఉప ఎన్నిక నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం షెడ్యూల్ విడుదల చేసిందని జిల్లా ఎన్నికల అధికారి, మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉప ఎన్నికకు సంబంధించి మార్చి 4న నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసనమండలి పరిధిలోని మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, వనపర్తి, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. షెడ్యూల్ ప్రకారం మార్చి 4న నోటిఫికేషన్ జారీ, నామినేషన్‌కు గడువు 11, 12న నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ, మార్చి 14న తుది గడువు, మార్చి 28 ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్, ఏప్రిల్ 2న ఓట్ల లెక్కింపు, 4వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని తెలియజేశారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు, మైక్, వాహన అనుమతులు సంబంధిత కలెక్టర్ల నుంచి పొందొచ్చని తెలిపారు.



## ఇదీ నియమావళి..

కోడ్ అమలులోకి వచ్చిన 24 నుంచి 72 గంటల్లోగా నియమావళి అమలుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. అధికారులు పక్షపాతం లేకుండా పారదర్శకంగా ఎన్నికల విధులు నిర్వహించాలి. ఇక కోడ్ అమల్లోకి వచ్చిన 24 గంటల్లో ప్రభుత్వ కార్యాలయాలు, కూడళ్లలో రాజకీయ పార్టీల హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు, పోస్టర్లు, బ్యానర్లు, జెండాలు, గోడ రాతలు లేకుండా చర్యలు తీసుకోనున్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ విషయంలో ఆర్డీవోలు నోడల్ అధికారులుగా వ్యవహరించనున్నారు. కాగా స్థానిక సంస్థల సమావేశాల కోసం జిల్లా ఎన్నికల అధికారి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఇక శంకుస్థాపనలు, ప్రారంభోత్సవం వంటి కార్యక్రమాలను వాయిదా వేయనున్నారు. ప్రజాప్రతినిధులు ప్రభుత్వ వాహనాలను వ్యక్తిగతంగా, రాజకీయ కార్యక్రమాలకు వినియోగించరాదు. ప్రభుత్వ స్థలాల్లో రాజకీయ సమావేశాలు నిర్వహించడానికి వీల్లేదు. అలాగే అధికారులు, ఇతర అన్ని రకాల ఉద్యోగులు కూడా రాజకీయ నాయకులను కలవడం, రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనడం నిషేధం. ఎవరైనా ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు ఆధారాలు లభిస్తే వెంటనే సస్పెండ్ చేయనున్నారు. ఎన్నికల ప్రచారాలు, రాజకీయ పార్టీల సమావేశాలను ఎస్ఎస్‌టీ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఎప్పటికప్పుడు వీడియో తీసి ఎన్నికల సంఘానికి చేరవేస్తాయి. నియమావళి ఉల్లంఘనలు జరిగితే వెంటనే చర్యలు తీసుకునేలా అధికారులకు ఎన్నికల సంఘం ఆదేశించింది. అధికారులు కోడ్‌ను ఉల్లంఘిస్తే ఆర్‌పీ యాక్ట్ 129ప్రకారం చర్యలు తీసుకోనున్నారు. నియమావళి ఉల్లంఘనకు సంబంధించిన సమస్యలుంటే జిల్లా ఎన్నికల అధికారులకు సమాచారం ఇవ్వాలి. అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగానే ఈ ఎన్నికల కోడ్ అమల్లోకి రానున్నది.

# జములమ్మ క్షేత్రం.. జనసంద్రం



ఆలయప్రాంగణంలో భక్తుల సందడి



భోజనాలు చేస్తున్న మహిళలు

- లక్ష మందికిపైగా తరలివచ్చిన ప్రజలు
- కిక్కిరిసిన జములమ్మ ఆలయ ప్రాంగణం
- స్తంభించిన ట్రాఫిక్

గద్వాల రూరల్, ఫిబ్రవరి 27 : నడిగడ్డ ఇలవేల్పు అయిన జములమ్మ క్షేత్రం జనసంద్రమైంది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు మంగళవారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే దర్శనానికి బారులుదీరడంతో ఆలయ ప్రాంగణమంతా కిటకిటలాడింది. అమ్మవారిని మెట్టినింటికి తీసుకొచ్చిన తర్వాత మొదటి మంగళవారం కావడంతో జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి దాదాపు లక్షమంది భక్తులు వచ్చినట్లు ఈవో పురేందర్‌కుమార్ తెలిపారు. కొందరు మహిళలు ఉపవాసంతో నైవేద్యాలు సమర్పించారు. కాగా భక్తులకు సర్వదర్శనంతోపాటు రెండు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. అమ్మవారి సన్నిధిలో భక్తులకు చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు భక్తులు అధికసంఖ్యలో తరలి రావడంతో ప్రధాన రోడ్డుపై ట్రాఫిక్ స్తంభించింది. రూరల్ ఎస్సై పర్వతాలు సిబ్బందితో కలిసి క్లియర్ చేశారు. కార్యక్రమంలో ఆలయ డైరెక్టర్లు జానకీరాములు, ఓంప్రకాశ్ కాంబ్లె, అభిలాష్, శంకర్, ఆలయ సిబ్బంది మురళీధర్‌రెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్ బాయ్స్ జూనియర్ కళాశాలలో హాల్‌టికెట్ నెంబర్లు వేస్తున్న సిబ్బంది

# పరీక్షలకు వేళాయె..

- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు
- ఏర్పాట్లు చేసిన అధికారులు
- సీసీ నిఘాలోనిర్వ హణ
- ఆయా జిల్లాలక లెక్టర్ల ఆధ్వర్యంలోపర్య వేక్షణ
- అమలుకానున్న నిమిషంనిబ ంధన
- విద్యార్థులకుఆ ర్టీసీ బస్సుల సౌకర్యం

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ) : ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం నుంచి మార్చి 16వ తేదీ వరకు ప్రథమ, ద్వితీయ సంవత్సర వార్షిక పరీక్షలు జరగనున్నాయి. ఇందుకోసం ఆయా జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో 65,662 మంది విద్యార్థులు ఈపరీ క్షలకు హాజరు కానున్నారు.

***నేటి నుంచి ప్రారంభం..***

ఇంటర్ పరీక్షలకు అధికారులు పూర్తి ఏర్పాట్లు చేపట్టారు. ఇందులో భాగంగా కలెక్టర్లు ఇప్పటికే సంబంధిత అధికారులతో సమీక్షించి ప్రశ్నాపత్రాలను ఆయా పోలీస్ స్టేషన్లలో భద్రపరిచారు. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఇందుకు అవసరమైన చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్లు, డీఈసీ మెంబర్లు, కస్టోడియన్లతో కూడిన అధికారులను నియమించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి జిరాక్స్ కేంద్రాలు మూసి ఉంచేలా ఆదేశించారు. ప్రతి కేంద్రం వద్ద పోలీసుల పహారా, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారు. ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు. గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా చర్యలు తీసుకోనున్నారు. రవాణా సదుపాయం కోసం ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. పరీక్ష సమయంలో విద్యుత్ అంతరాయం కలుగకుండా చూడాలని సంబంధిత శాఖకు సూచించారు. సమస్యలను పరిష్కరించేందుకు కంట్రోల్ రూం సైతం ఏర్పాటు చేశారు. ఇంటర్ బోర్డు ఆధ్వర్యంలో 14416, 040–24655027 టోల్ ఫ్రీ నెంబర్లను ఏర్పాటు చేశారు. కాగా, మహబూబ్‌నగర్ జిల్లాలో ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ కలిపి 21,930 మంది, నారాయణపేటలో 8,837, వనపర్తిలో 12,457, గద్వాలలో 8,567 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

### విద్యార్థులకు సూచనలు

- ⇨ పరీక్ష హాల్ టికెట్, పెన్నులు, పెన్సిళ్లు, ప్యాడ్లు తీసుకురావాలి
- ⇨ పరీక్షా కేంద్రానికి గంట ముందే వెళ్లాలి.
- ⇨ పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, డిజిటల్ వాచ్‌లు, షూస్ అనుమతి లేదు
- ⇨ ఎండాకాలం కావడంతో అల్పాహారం తప్పనిసరిగా చేసి వెళ్లాలి.
- ⇨ 24పేజీల బుక్‌లెట్ ఇస్తారు. అందులోనే సమాధానాలు రాయాలి. అడిషనల్ పేపర్లు ఇవ్వరు.
- ⇨ ఒక్క నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతి ఉండదు.

### అన్ని చర్యలు తీసుకున్నాం..



నాగర్‌కర్నూల్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్, గురుకుల కళాశాలలు 32 ఉండగా, ఒకేషనల్‌తో కలిపి ఫస్టియర్‌లో 11,203 మంది, సెకండియర్‌లో 2,668 మంది మొత్తం 13,871 మంది ఇంటర్ పరీక్షలకు హాజరవుతున్నారు. ఇందుకోసం 32 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 32 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 11మంది అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లు, ఆరుగురు కస్టోడియన్లు, ఇద్దరు ఫ్లయింగ్, ఇద్దరు సిట్టింగ్ స్క్వాడ్లను నియమించాం. పరీక్షలు ప్రశాంతంగా, పకడ్బందీగా జరిపేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నాం.

*- వెంకటరమణ, జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి, నాగర్‌కర్నూల్*

















